క్లుప్తంగా

కాళికాంబదేవికి ప్రత్యేక పూజలు

నంద్యాల(వ్యవసాయం): గాంధీచౌక్‌లో వెలసిన శ్రీకాళికాంబ చంద్రశేఖరస్వామి దేవస్థానంలో శుక్రవారం సందర్భంగా కాళికాంబదేవికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అమ్మవారి మూలవిరాట్‌కు ఉదయం సుప్రభాతసేవ, పంచామృతాభిషేకం అనంతరం వివిధ రకాల పూజలు చేపట్టి ప్రత్యేకంగా అలంకరించారు. ఎమ్మెల్యే సతీమణి శిల్పా నాగినిరెడ్డి అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ అధికారులు శాలువా, మెమొంటో ఇచ్చి ఆమెను సత్కరించారు.

మహిళల జీవనోపాధికి పట్టణ సమృద్ధి యూనిట్లు

నంద్యాల(సిటీ): పట్టణంలోని మహిళల జీవనోపాధి కోసం పట్టణ పేదరిక నిర్మూలన సంస్థ (మెప్మా) ఆధ్వర్యంలో పట్టణ సమృద్ధి యూనిట్లు ఏర్పాటు చేస్తున్నట్లు మెప్మా సీఎంఎం విజయభాస్కర్‌రెడ్డి తెలిపారు. శుక్రవారం పట్టణంలోని ముల్లాన్ పేటకు చెందిన షబానా అనే పొదుపు సంఘం సభ్యురాలికి చేపల యూనిట్‌ను ఏర్పాటు చేశారు.

క్రీడలతో ఉజ్వల భవిష్యత్



పోటీలను ప్రారంభిస్తున్న దస్తగిరిరెడ్డి

నంద్యాల(న్యూటౌన్): క్రీడలతోనే విద్యార్థులకు ఉజ్వల భవిష్యత్ లభిస్తుందని గురురాఘవేంద్ర బ్యాంకింగ్ కోచింగ్ సెంటర్ అధినేత దస్తగిరిరెడ్డి, ఐఎంఏ రాష్ట్ర మాజీ అధ్యక్షుడు డాక్టర్ రవికృష్ణ పేర్కొన్నారు. శుక్రవారం పట్టణంలోని గురురాజ క్రీడా ప్రాంగణంలో అన్యువల్ స్పోర్ట్స్ మీట్‌ను ప్రారంభించారు. విద్యాసంస్థల డైరెక్టర్ షేక్షావలిరెడ్డి ఆధ్వర్యంలో పోటీలు జరిగాయి. కో ఆర్డినేటర్ రామలింగం, భాగ్యలక్ష్మి, గీతాలావణ్య పాల్గొన్నారు.

కన్నీరు.. పన్నీరు పుస్తకావిష్కరణ

నంద్యాల(న్యూటౌన్): స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో కన్నీరు.. పన్నీరు అనే పుస్తకాన్ని ప్రిన్సిపాల్ శశికళ శుక్రవారం ఆవిష్కరించారు. ఆమె మాట్లాడుతూ బీకాం ద్వితీయ సంవత్సరం చదివే మహమ్మద్ అనే విద్యార్థి పుస్తకాన్ని రచించడం అభినందనీయమన్నారు. అనంతరం మహమ్మద్ మాట్లాడుతూ తాను రచించిన పుస్తకాన్ని తమ అధ్యాపకులు ఆవిష్కరించడం సంతోషంగా ఉందన్నారు. అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

జగనన్న ఆరోగ్య సురక్షకు స్పందన

రుద్రవరం: జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమానికి గ్రామాల్లో విశేష స్పందన లభిస్తోంది. మండలంలోని మందలూరులో సర్పంచు నిర్మలమ్మ ఆధ్వర్యంలో శుక్రవారం రెండో విడత జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. ఆలమూరు పీహెచ్‌సీ వైద్యాధికారి గాయత్రి, స్పెషలిస్టు వైద్యులు ప్రశాంత్‌కుమార్, శివాణి పాల్గొని 415 మంది రోగులకు వైద్య పరీక్షలు నిర్వహించి తగిన మందులు అందజేశారు. హెల్త్ సూపర్ వైజర్ బాలస్వామి, ఎంపీహెచ్ఏ కొల్లం బాలనరసింహుడు పాల్గొన్నారు.

ఆర్యవైశ్య కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్‌గా నెరవాటి శిరీష



శిరీషను అభినందిస్తున్న మాజీ మంత్రి వెల్లంపల్లి, కుప్పం ప్రసాద్

నంద్యాల(వ్యవసాయం): పట్టణానికి చెందిన వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకుడు నెరవాటి సత్యనారాయణ తనయుడు నెరవాటి రవి సతీమణి శిరీష రాష్ట్ర ఆర్యవైశ్య కార్పొరేషన్ డైరెక్టర్‌గా విజయవాడలో శుక్రవారం కార్పొరేషన్ చైర్మన్ కుప్పం ప్రసాద్ కార్యాలయంలో ప్రమాణ స్వీకారం చేశారు. ఆమె మాట్లాడుతూ తనకు ఈ బాధ్యతలు అప్పగించిన సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి, మాజీ మంత్రి వెల్లంపల్లి శ్రీనివాసరావు, కుప్పం ప్రసాద్, మాజీ మంత్రి శిల్పామోహన్‌రెడ్డి, ఎంపీ పోచా బ్రహ్మానందరెడ్డికి, ఎమ్మెల్యేలు శిల్పా చక్రపాణిరెడ్డి, శిల్పారవిచంద్రకిశోర్‌రెడ్డికి, ఎమ్మెల్సీ ఇసాక్‌బాషాకు కృతజ్ఞతలు తెలిపారు.

రేపు ఉచిత వైద్య శిబిరం

శిరివెళ్ల: ఈ నెల 17వ తేదీన స్థానిక శ్రీవాణి స్కూల్ సమీపంలోని ఉల్లి నాగేష్ కాంప్లెక్స్‌లో ఉచిత వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు పూర్వ విద్యార్థుల సంఘం నాయకుడు కండె ఆనంద్ గురూజీ శుక్రవారం తెలిపారు. శిబిరంలో నేత్ర, కిడ్నీ, గుండె జబ్బులకు నంద్యాల శాంతిరాం ఆస్పత్రి వైద్యులు వైద్య పరీక్షలు చేసి చికిత్స అందజేస్తారని చెప్పారు.

నేడు విద్యాశాఖ ముఖ్య కార్యదర్శి రాక

నంద్యాల(న్యూటౌన్): రాష్ట్ర విద్యాశాఖ ముఖ్యకార్యదర్శి ప్రవీణ్‌ప్రకాష్ శనివారం నంద్యాల జిల్లాలో పలు పాఠశాలలను పరిశీలించేందుకు రానున్నారని డీఈఓ సుధాకర్‌రెడ్డి శుక్రవారం రాత్రి తెలిపారు.

వినియోగదారుల్లో చైతన్యం తేవాలి

నంద్యాల(వ్యవసాయం): వినియోగదారుల్లో చైతన్యం తీసుకురావాల్సిన బాధ్యత అధికారులపై ఉందని జిల్లా పౌరసరఫరాల శాఖ అధికారి వెంకటరాముడు అన్నారు. శుక్రవారం ప్రపంచ వినియోగదారుల హక్కుల దినోత్సవాన్ని స్థానిక పౌరసరఫరాల శాఖ కార్యాలయంలో నిర్వహించారు. జిల్లా ఫుడ్‌సేఫ్టీ అధికారి రాముడు, తూనికల కొలతల అధికారిణి అనిత, జిల్లా వినియోగదారుల అధ్యక్షుడు అమీర్‌బాషా పాల్గొన్నారు.

సీఏఏను వ్యతిరేకించాలి

నంద్యాల(న్యూటౌన్): లౌకిక వాదులందరూ సీఏఏను వ్యతిరేకించాలని సీపీఎం జిల్లా కార్యదర్శి రమేష్‌కుమార్ కోరారు. శుక్రవారం స్థానిక సీపీఎం కార్యాలయంలో ముస్లిం, ప్రజా సంఘాలు, కాంగ్రెస్, వామపక్ష పార్టీల ఆధ్వర్యంలో సమావేశం జరిగింది. సీపీఐ పట్టణ కార్యదర్శి ప్రసాద్, ఎస్‌వైడీ ప్రసాద్, అబుల్లైజ్, సమ్మద్, రాష్ట్ర క్రిస్టియన్ జేఏసీ కన్వీనర్ మన్నెం జానయ్య మాట్లాడారు.

దొర్నిపాడు...అభివృద్ధి చూడు

- గ్రామస్తులకు సంక్షేమం ద్వారా రూ.39.28 కోట్ల లబ్ధి
- రూ.80 లక్షలతో సచివాలయ భవనాల నిర్మాణం
- రూ.42 లక్షలతో ఆర్‌బీకేల ఏర్పాటు
- రూ. 2కోట్లతో ప్రధాన రహదారిలో సీసీ రోడ్డు
- రూ.28.62 లక్షలతో నూతన సొసైటీ కార్యాలయం
- రూ.40 లక్షలతో 500 మెట్రిక్ టన్నుల గోదాం పూర్తి
- రూ.25 లక్షలతో సంతమార్కెట్ అభివృద్ధి



ఒకే ప్రాంగణంలో నిర్మించిన రెండు సచివాలయాలు



ఒకే చోటా రెండు వైఎస్సార్ రైతు భరోసా కేంద్రాలు



నూతనంగా నిర్మించిన గోదాం, సొసైటీ కార్యాలయం



బీసీ కాలనీలో నిర్మించిన సీసీ రోడ్డు

దొర్నిపాడు: కళ్లముందే అభివృద్ధి...ఇంటి వద్దకే సంక్షేమం.. ఇదీ ఐదేళ్లుగా వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం మండల కేంద్రంలో చేపట్టిన ప్రగతి. సచివాలయ వ్యవస్థ ద్వారా కలగానే మిగిలిన గ్రామ స్వరాజ్యాన్ని అమలు చేసి చూపారు. లక్షలాది రూపాయలు వెచ్చించి సచివాలయాలు, ఆర్బీకేలు, గోదాము, సంతమార్కెట్ అభివృద్ధి, సీసీ రోడ్లు, డ్రైనేజీలు, సొసైటీ కార్యాలయం తదితర వాటిని నిర్మించి ప్రజల అవస్థలను తీర్చారు. ఇక వివిధ సంక్షేమ పథకాల ద్వారా అర్హులైన పేదలను ఆర్థికంగా ఆదుకున్నారు. లబ్ధిదారుల ఖాతాల్లో లక్షలాది రూపాయలు జమ చేశారు. మునుపెన్నడూ లేనట్లుగా గ్రామంలో భూసార పరీక్షల నుంచి దిగుబడుల కొనుగోలు వరకు చేపట్టారు.దీంతో అన్నదాతలకు విత్తన, ఎరువుల కొనుగోళ్లలో ఇబ్బందులు తప్పాయి. గతంలో సంక్షేమ పథకాలు గ్రామంలో వేళ్లపై లెక్కపెట్టేంత మందికి మాత్రమే అందేవి. ఎందరికో అర్హత ఉన్నా రాజకీయ పలుబడి లేకపోవడంతో వాటికి దూరంగా నిలిచిపోయారు. జగనన్న వచ్చాక కేవలం అర్హత ఆధారంగా పథకాలు అందజేసి పేదల అభ్యున్నతికి కృషి చేశారు. దీంతో ప్రజల నుంచి హర్షం వ్యక్తమవుతోంది.

దొర్నిపాడులో సంక్షేమం, అభివృద్ధి వివరాలు..

పథకాలు	సచివాలయం-1 లబ్ధిదారులు	పంపిణీ చేసిన నగదు	సచివాయం-2 లబ్ధిదారులు	పంపిణీ చేసిన నగదు
అమ్మ ఒడి	356	1,67,95,000	359	1,64,24,555
జగనన్న విద్యా దీవెన	260	72,70,089	253	7786453
జగనన్న వసతి దీవెన	215	37,09,513	187	3421337
వైఎస్సార్ రైతు భరోసా	588	2,42,44,500	477	21856050
డాక్టర్ వైఎస్సార్ పంటల బీమా	298	77,04,466	235	6722896
వైఎస్సార్ సున్నా వడ్డీ పంటరుణాలు	209	5,30,680	133	3,44,562
రైతులకు ఇన్‌ఫుట్ సబ్సిడీ	263	23,67,900	153	12,37,550
వైఎస్సార్ పింఛన్ కానుక	473	4,83,11,000	468	4,53,91,750
వైఎస్సార్ చేయూత	160	76,12,500	186	88,87,500
వైఎస్సార్ ఆసరా	372	75,37,895	453	98,54,394
వైఎస్సార్ సున్నా వడ్డీ	640	26,93,017	655	26,52,437
వైఎస్సార్ కాపునేస్తం	41	19,05,000	32	13,20,000
వైఎస్సార్ ఈబీసీ నేస్తం	16	4,35,000	15	3,75,000
వైఎస్సార్ ఆరోగ్యశ్రీ	153	77,55,110	186	65,95,723
వైఎస్సార్ ఆరోగ్య ఆసరా	88	7,73,900	120	9,48,550
హౌసింగ్	53	66,34,590	26	24,52,226
వైఎస్సార్ బీమా	6	5,60,000	9	12,30,000
వైఎస్సార్ వాహనమిత్ర	11	2,50,000	11	2,70,000
జగనన్న చేదోడు	53	11,40,000	12	2,40,000
ప్రత్యేక కోవిడ్ సాయం	878	8,78,000	826	8,26,000
జగనన్న తోడు(వడ్డీ)	43	20,672	60	28,394
మొత్తం		15,31,28,832		13,88,65,377
నాన్‌డీబీటీ వివరాలు				
ఇళ్ల స్థలాలు	73	1,79,58,000	73	1,79,58,000
జగనన్న విద్యాకానుక	183	12,99,666	299	21,23,498
ట్యాబ్‌ల పంపిణీ	33	4,36,326	36	4,75,992
జగనన్నతోడు (రుణాలు)	54	1005426	78	14,52,282
జగనన్న గోరుముద్ద	194	1921958	278	27,54,146
వైఎస్సార్ సంపూర్ణ పోషణ	391	7323430	237	44,39,010
ఇంటింటా రేషన్	982	2,14,50,808	928	2,02,71,232
మొత్తం		5,13,95,614		4,94,74,160
డీబీటీ మరియు నాన్ డీబీటీ		20,45,24,446		18,83,39,537



ప్రధాన రహదారిపై నిర్మించిన సీసీరోడ్డు

ఎన్నడూ లేని అభివృద్ధిని చూశాం



మండలకేంద్రంలో ఏ ప్రభుత్వం ఇంతలా అభివృద్ధి చేయలేదు. మా కాలనీలో సీసీ రోడ్లు లేక చాలా ఏళ్ల నుంచి ఇబ్బందులు పడేవాళ్లం. ప్రస్తుతం రోడ్లు వేయడంతో పాటు సచివాలయాల భవనాలను నిర్మించారు. ఎన్నో దశాబ్దాలుగా ప్రధాన రహదారి గుంతల మయమైనా పట్టించుకోలేదు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం వచ్చాకే సీసీరోడ్డు వేశారు. ఏ సమస్య వచ్చినా వలంటీర్లు పరిష్కరిస్తున్నారు. పేదలకు సంక్షేమ పథకాలు అందజేసి ఆదుకుంటున్నారు.

– బత్తులలక్ష్మ, దొర్నిపాడు, బీసీ కాలనీ

అభివృద్ధిలో పాలు పంచుకోవడం అదృష్టం



గత ఐదేళ్లలో ప్రభుత్వం ఎన్నో అభివృద్ధి, సంక్షేమ పథకాలను తీసుకొచ్చింది. ఇంత గొప్పగా అభివృద్ధి జరిగిన ప్రభుత్వంలో తాను పాలుపంచుకోవడం అదృష్టంగా భావిస్తున్నా. ముఖ్యంగా దీర్ఘకాలికంగా సరైన మార్కెట్ లేక వ్యాపారులు, వినియోగదారులు ఇబ్బందులు పడ్డారు. ప్రస్తుత ప్రభుత్వం రూ.25 లక్షలు వెచ్చించి బాగుచేయడంతో వారికి అవస్థలు తప్పాయి.

– సానిక దేవమణి, సర్పంచ్, దొర్నిపాడు

రోడ్డు నిర్మాణానికి భూమి పూజ



మల్లెవేములలో రోడ్డు పనులకు భూమి పూజ చేస్తున్న ప్రజాప్రతినిధులు

చాగలమర్రి: మండలంలోని మల్లెవేముల గ్రామం నుంచి కలుగొట్లపల్లె గ్రామం వరకు 3.4 కి.మీలు, రూ.1.15 కోట్ల వ్యయంతో నిర్మించనున్న మెటల్ రోడ్డు, 5 కల్వర్టుల నిర్మాణాలను శుక్రవారం సర్పంచ్ ఈదుల సరోజమ్మ, జెడ్పీటీసీ సభ్యురాలు జి.లక్ష్మీదేవి, ఎంపీపీ వీరభద్రుడు, జెసీఎస్ జిల్లా కో–ఆర్డినేటర్ షేక్.బాబూలాల్ భూమి పూజ చేసి ప్రారంభించారు. సర్పంచ్‌లు గోవిందయ్య, దస్తగిరిరెడ్డి, వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు జి.కుమార్‌రెడ్డి, జిల్లా సేవాదళ్ అధ్యక్షుడు జి.గణేష్‌రెడ్డి, ఉప సర్పంచ్ వెంకటసుబ్బారెడ్డి, నాయకులు జ్యోతీశ్వరరెడ్డి, మల్లారెడ్డి, స్వామిరెడ్డి,బాబుల్‌రెడ్డి, రాముడు, బ్రహ్మానందరెడ్డి, సుదర్శన్‌రెడ్డి, ఇన్‌చార్జ్ ఎంపీడీఓ రాజేంద్రప్రసాద్, ఏఈ కొండారెడ్డి, పంచాయతీ కార్యదర్శి రజశేఖర్ పాల్గొన్నారు.

టీడీపీ నుంచి వైఎస్సార్‌సీపీలో చేరిక



ఆర్.నాగులవరంలో వైఎస్సార్‌సీపీలో చేరిన వారితో భూమా కిశోర్‌రెడ్డి, గంధం భాస్కర్‌రెడ్డి

రుద్రవరం: మండలంలోని ఆర్.నాగులవరంలో శుక్రవారం టీడీపీ వర్గీయులు భారీగా భూమా కిశోర్‌రెడ్డి,గంధం భాస్కర్‌రెడ్డి ఆధ్వర్యంలో వైఎస్సార్‌సీపీలో చేరారు. గ్రామానికి చెందిన టీడీపీ వర్గీయులు గంధం భాస్కర్‌రెడ్డితో చర్చించి భూమా కిశోర్‌రెడ్డిని గ్రామానికి ఆహ్వానించారు. మాజీ ఎంపీపీలు కొండా వేమయ్య, లక్ష్మీదేవి, మాజీ ఎంపీటీసీ కాశిరెడ్డి, మాజీ ఉప సర్పంచు ప్రహ్లాద,శివారెడ్డి,శివరామిరెడ్డి,రమేష్,లింగేష్,దస్తగిరి, నాగిశెట్టి, మురళి, సింగరయ్య, మునెయ్య, మద్దారమ్మ, వరలక్ష్మి,కమాలమ్మ, ఉశేనమ్మతో పాటు మరో వంద కుటుంబాలు పార్టీ చేరడంతో వారికి కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. కొండా నరసింహ, సీతారామిరెడ్డి,గోస్‌పీర్ ఉన్నారు.

కారుణ్య నియామకాలతో జీవితాల్లో వెలుగులు



కమిషనర్‌కు కృతజ్ఞత తెలియజేస్తున్న కార్మికులు

నంద్యాల(సిటీ): కారుణ్య నియామకాలతో కార్మికుల జీవితాల్లో వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం వెలుగులు నింపింది. పట్టణంలో నాలుగున్నర సంవత్సరాలకు పైగా మున్సిపాలిటీలో విధులు నిర్వర్తిస్తూ మరణించిన వారి స్థానాల్లో వారి కుటుంబ సభ్యులకు, 60 సంవత్సరాలు నిండిన వారి కుటుంబాలలోని వారి పిల్లలకు ఉపాధి కల్పిస్తూ ఆప్కాస్ ద్వారా చేపట్టిన నియామక ప్రక్రియ గురువారానికి పూర్తయ్యిందని మున్సిపల్ కమిషనర్ నిరంజన్‌రెడ్డి తెలిపారు. నియామకాలు పొందిన కార్మికులు శుక్రవారం జిల్లా కలెక్టర్ డాక్టర్ శ్రీనివాసులు, ఎమ్మెల్యే శిల్పా రవిచంద్రకిశోర్‌రెడ్డి, మున్సిపల్ చైర్‌పర్సన్ మాబున్నిసా, కమిషనర్ నిరంజన్ రెడ్డి, ఇతర అధికారులకు కృతజ్ఞతలు తెలిపారు. కమిషనర్ మాట్లాడుతూ ఆప్కాస్ కింద ఉపాధి పొందిన 34 మందిలో 23 మంది పబ్లిక్ హెల్త్ విభాగంలో, 11 మంది నాన్ పబ్లిక్ హెల్త్ విభాగంలో విధులు నిర్వర్తిస్తారని చెప్పారు.

సమస్యాత్మక కేంద్రాలను గుర్తించండి



మాట్లాడుతున్న ఆర్‌ఓ మల్లికార్జునరెడ్డి, పక్కన డీఎస్పీ షర్ఫుద్దీన్

ఆళ్లగడ్డ : రాబోయే ఎన్నిలను దృష్టిలో పెట్టుకొని నియోజకవర్గంలోని సమస్యాత్మక, అత్యంత సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలను, గ్రామాలను గుర్తించాలని ఆళ్లగడ్డ అసెంబ్లీ ఎన్నికల రిటర్నింగ్ అధికారి మల్లికార్జున రెడ్డి అధికారులను ఆదేశించారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో శుక్రవారం నియోజకవర్గంలోని సహాయ రిటర్నింగ్ అధికారులు, బీఎల్‌ఓలు, పోలీస్ అధికారులతో సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ఆయా వివరాలను వెంటనే అందజేయాలని సూచించారు. ఎన్నికల నిర్వహణలో సెక్టోరియల్ అధికారులు క్రియాశీలక పాత్ర పోషించాల్సి ఉంటుందని, సమన్వయంతో, నిబంధనలకు లోబడి విధులు నిర్వహించాలని చెప్పారు. ప్రతి పోలింగ్ కేంద్రం పరిధిలో నెలకొన్న సమస్యలను క్షేత్రస్థాయిలో పరిశీలిస్తూ.. ఎప్పటికప్పుడు ఎన్నికల అధికారుల దృష్టికి తేవాలని చెప్పారు. ఓటు హక్కు వినియోగించుకోకుండా నిలువరించేలా చేసే వారిని, ఓటర్లను ప్రలోభపెట్టే వారిపై నిఘా ఉంచాలని స్పష్టం చేశారు. డీఎస్పీ షర్ఫుద్దీన్ మాట్లాడుతూ సమస్యాత్మక, అత్యంత సమస్యాత్మక కేంద్రాల వద్ద అదనపు సిబ్బంది, సాయుధ బలగాలను మోహరిస్తామని తెలిపారు. సీఐలు రమేష్‌బాబు, హనుమంత నాయక్, చంద్రబాబు తదితరులు పాల్గొన్నారు

బీమా తక్షణ సాయం అందజేత

చాగలమర్రి: స్థానిక ముత్యాలపాడు బస్టాండ్ వీధికి చెందిన మస్తాన్ కుందూ నదిలో మునిగి మృతి చెందిన విషయం తెలిసిందే. కాగా.. మృతుడికి వైఎస్సార్ బీమా వర్తించడంతో నామినీ అయిన తండ్రి అమీర్‌కు తక్షణ సాయం కింద రూ.10వేలను సర్పంచ్ తులసమ్మ, ఇన్‌చార్జ్ ఈఓ నాగమణి, వైస్ ఎంపీపీ ముల్లా రఫీ శుక్రవారం అందజేశారు.

మద్యం సీసాలు స్వాధీనం

దొర్నిపాడు: అక్రమంగా మద్యం విక్రయిస్తున్న ఓ వ్యక్తి నుంచి మద్యం సీసాలు స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఐ సురేష్ శుక్రవారం తెలిపారు. మండల కేంద్రానికి చెందిన శంకర్ అక్రమంగా మద్యం సీసాలు విక్రయిస్తున్నట్లు సమాచారం రావడంతో సిబ్బందితో కలిసి దాడులు చేసి 11 మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకున్నట్లు చెప్పారు.

నిత్యావసర కిట్ల పంపిణీ

నంద్యాల(న్యూటౌన్): పట్టణంలోని లైఫ్ పరివర్తన సెంటర్‌లో శుక్రవారం నంద్యాల లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో చిన్నారులకు క్లబ్ సభ్యుడు గుండా మనోజ్ సౌజన్యంతో నిత్యావసర కిట్లు పంపిణీ చేశారు. అధ్యక్షుడు పీవీ సుధాకర్‌రెడ్డి, ఐఎంఏ రాష్ట్ర మాజీ అధ్యక్షుడు డాక్టర్ రవికృష్ణ మాట్లాడారు.

పశుసంవర్ధక శాఖ సహాయకుల నియామకం

శిరివెళ్ల: మండలానికి ఆరుగురు పశుసంవర్ధక శాఖ సహాయకులను నియమించారని ఏడీఏహెచ్ గిడ్డయ్య శుక్రవారం తెలిపారు. శిరివెళ్ల 1వ సచివాలయానికి జయమ్మ, గుంప్రమాన్‌దిన్నెకు ప్రవంతి, చెన్నూరుకు హేమలత, బోయలకుంట్లకు మనీషా, గుండంపాడుకు కావేరి, గంగవరం సచివాలయానికి ఇర్ఫానాను నియమించారని చెప్పారు. వీరు 4 నెలల పాటు శిరివెళ్ల, గోవిందపల్లె పశు వైద్యశాలలో శాఖాపరమైన శిక్షణ పొందిన అనంతరం కేటాయించిన సచివాలయాలలో విధులు నిర్వర్తిస్తారని వివరించారు.

ఆకతాయికి జైలు శిక్ష

నంద్యాల(వ్యవసాయం): మహానంది దేవస్థానం ఆవరణలో అసభ్యకరంగా ప్రవరిస్తున్న వ్యక్తికి సెకండ్ క్లాస్ మెజిస్ట్రేట్ రామిరెడ్డిగారి రాంభూపాల్‌రెడ్డి జైలు శిక్షను ఖరారు చేసినట్లు పోలీసులు తెలిపారు. వివరాలు..తిమ్మాపురం గ్రామానికి చెందిన షేక్ కొలిమి జమాల్‌వలి దేవస్థాన ఆవరణలో మహిళల పట్ల ఈలలు వేస్తూ, సైగలు చేస్తూ అసభ్యకరంగా ప్రవర్తిస్తుండటంతో స్థానికులు మహానంది పోలీసులకు సమాచారం ఇవ్వడంతో నిందితుడిని అరెస్ట్ చేసి కోర్టులో హాజరు పరచగా జడ్జి ఏడు రోజుల జైలు శిక్ష విధించారని పోలీసులు చెప్పారు.

బాధితురాలిని ఆదుకుంటాం

నంద్యాల(అర్బన్): విజయ డెయిరీలో విధులు నిర్వహిస్తూ ప్రమాదానికి గురైన పొన్నాపురం గ్రామానికి చెందిన కృష్ణమ్మ వైద్యసేవలకు అయ్యే ఖర్చులు భరించి ఆదుకుంటామని డెయిరీ ఎండీ ప్రదీప్‌కుమార్ తెలిపారు. బాధితురాలిని ఆదుకోవాలంటూ ఎంవీఆర్‌పీఎస్ నేతలు పులికొండన్న ఆధ్వర్యంలో శుక్రవారం ఎండీకి వినతి పత్రం అందజేశారు.

ఆలయ పునర్నిర్మాణ పనులు ప్రారంభం

నంద్యాల(వ్యవసాయం): పట్టణ శివారులోని చిన్న చెరువు కట్ట వద్ద వెలసిన భీమేశ్వరస్వామి ఆలయ పునర్నిర్మాణ పనులను శుక్రవారం కౌన్సిలర్ భీమునిపల్లి పురందర్, దేవస్థానం చైర్మన్ సన్నల వెంకటరెడ్డి భూమి పూజ చేసి ప్రారంభించారు. వారు మాట్లాడుతూ దేవస్థానం నిర్మాణానికి సీజీఎఫ్ నిధుల నుంచి రూ.1.20 కోట్లను ఎమ్మెల్యే శిల్పా రవిచంద్రకిశోర్‌రెడ్డి మంజూరు చేయించారని చెప్పారు.

ఉపాధ్యాయులకు శిక్షణ

నంద్యాల(న్యూటౌన్): స్థానిక శ్యామ కాల్వ సమీపంలోనున్న శ్రీచైతన్య ఇంగ్లిష్ మీడియం పాఠశాలలో భారత్ స్కౌట్ అండ్ గైడ్స్ వన్‌డే బిగినర్స్ కోర్సులో భాగంగా ఉపాధ్యాయులకు శుక్రవారం ఒక్క రోజు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. జిల్లా చీఫ్ కమిషనర్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో భారత్ స్కౌట్స్ అండ్ గైడ్స్ నంద్యాల జిల్లా సెక్రటరీ తూర్పు లింగారెడ్డి, పీడీలు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

నంద్యాల సమగ్రాభివృద్ధి లక్ష్యంగా పాలన





శిలా ఫలకాన్ని ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే శిల్పా రవి, ఇఫ్తార్ విందులో పాల్గొన్న ఎమ్మెల్యే

నంద్యాల టౌన్: సంక్షేమం, అభివృద్ధి లక్ష్యంగా పాలన సాగిస్తున్నామని ఎమ్మెల్యే శిల్పా రవిచంద్రకిశోర్ రెడ్డి పేర్కొన్నారు. పట్టణంలోని 15 వార్డులో రూ.63 లక్షలతో సీసీ రోడ్డు, డ్రైన్ల నిర్మాణ అభివృద్ధి పనులను మున్సిపల్ చైర్‌పర్సన్ మాబున్నీసాతో కలిసి ప్రారంభించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ పట్టణ సమగ్రాభివద్ధికి అనేక అభివృద్ధి కార్యక్రమాలను చేపడుతున్నామని ఇందులో భాగంగానే సీసీ రోడ్లు, డ్రైన్లు, ప్యాచ్ వర్క్స్ పూర్తి చేశామన్నారు. అనంతరం చలి వేంద్రం ప్రారంభించారు. మున్సిపల్ వైస్ చైర్మన్ పాంషావలి, కౌన్సిలర్ సన్నాల అనూష, ఇన్‌చార్జ్ సాయిరాంరెడ్డి, సురేష్ పాల్, మోహన్, లింగప్రసాద్, శ్రీనివాసులు, గిరిధర్, సంపత్, లక్ష్మీదేవి, రామలక్ష్మి, ఉస్మాన్, సలీం, శ్రీరాములు పాల్గొన్నారు.

కమ్యూనిటీ హాల్ ప్రారంభం..

బొమ్మలసత్రం: నంద్యాల పట్టణంలోని 9వ వార్డులోని గుడిపాటిగడ్డ వీధిలో పొదుపు మహిళల కోసం నిర్మించిన కమ్యూనిటీ హాల్‌ను ఎమ్మెల్యే శిల్పా రవి శుక్రవారం ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ వార్డు మహిళలకు ఇచ్చిన మాట కోసం రూ. 8.50 లక్షలతో కమ్యూనిటీ హాల్‌ను నిర్మించామని చెప్పారు. ఈ హాల్ పొదుపు మహిళల సమావేశాలు, కార్యక్రమాల కోసం ఉపయోగపడుతుందన్నారు. పేదలకు ఉచిత మినరల్ వాటర్ ప్లాంటును స్థాపించామని అది మరో రెండు రోజుల్లో అందుబాటులోకి వస్తుందన్నారు. జండామాను వీధి నుంచి వెంకటేశ్వర స్వామి దేవాలయం వరకు సీసీరోడ్డు నిర్మాణం పూర్తయ్యిందని, ఆలయం సమీపంలో మరో రూ.15 లక్షలతో సీసీరోడ్డు నిర్మాణానికి టెండర్లు పిలిచామని తెలిపారు. కౌన్సిలర్ దండె నాగమ్మ, కోఆప్షన్ మెంబర్ పడకండ్ల సుబ్రహ్మణ్యం పాల్గొన్నారు.

మతసామరస్యానికి ప్రతీక ఇఫ్తార్

నంద్యాల(సిటీ): మతసామరస్యానికి ఇఫ్తార్ ప్రతీక అని ఎమ్మెల్యే శిల్పా రవిచంద్రకిశోర్‌రెడ్డి అన్నారు. శుక్రవారం యూసుఫ్, ఇస్మాయిల్, రహ్మత్, మదీనా మసీద్, ఫాతిమా మసీద్, మక్కా మస్జిద్, మదీనా, అబుసాద్, జులేఖ ఖాసీం తదితర 15 ప్రాంతాల్లో ముస్లింలకు ఎమ్మెల్యే ఇఫ్తార్ విందు ఏర్పాటు చేశారు. మూలసాగరంలో మహమ్మదీయ, కౌసర్ మసీదుల్లో ప్రత్యేక ప్రార్థనల అనంతరం విందులో పాల్గొన్నారు.

ప్రశాంత ఎన్నికల నిర్వహణే లక్ష్యం



మాట్లాడుతున్న జాయింట్ కలెక్టర్ రాహుల్‌కుమార్‌రెడ్డి

నంద్యాల(అర్బన్): ప్రశాంత ఎన్నికల నిర్వహణే లక్ష్యంగా అధికారులు విధులు నిర్వహించాలని జాయింట్ కలెక్టర్ రాహుల్‌కుమార్‌రెడ్డి తెలిపారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో శుక్రవారం నంద్యాల నియోజకవర్గ తహసీల్దార్లు, పోలీసు అధికారులతో సమావేశం నిర్వహించారు. జేసీ మాట్లాడుతూ సమస్యాత్మక పోలింగ్ కేంద్రాల వద్ద అదనపు భద్రత పెంచాలని సూచించారు. అల్లర్లకు పాల్పడే వారిపై బైండోవర్ కేసులు నమోదు చేయాలని ఆదేశించారు. అల్లర్లు జరిగే పోలింగ్ కేంద్రాల వద్ద సీసీ కెమెరాలు ఏర్పాటు చేసి భద్రతను పెంచాలన్నారు. ప్రశాంత ఎన్నికలకు అందరూ సహకరించాలని కోరారు. డీఎస్పీ రవీంద్రారెడ్డి, సీఐలు, ఎస్ఐలు, నంద్యాల ఎన్నికల డీటీ శ్రీనివాసరెడ్డి పాల్గొన్నారు.

గడ్డివాముల దగ్ధం

ఆళ్లగడ్డ: పట్టణంలోని రామలక్ష్మి కొట్టాల కాలనీలో శుక్రవారం సాయంత్రం జరిగిన అగ్ని ప్రమాదంలో ఆరు గడ్డి వాములు దగ్ధమయ్యాయి. ప్రమాదవశాత్తు ఓ గడ్డి వామి దగ్గర మంటల వ్యాపించగా స్థానికులు అగ్నిమాపక శాఖ అధికారులకు సమాచారం ఇచ్చేలోపు మంటలు చెలరేగి సమీపంలోనున్న అన్ని గడ్డి వాములకు వ్యాపించి పూర్తిగా కాలిబూడిదయ్యాయి.

ఉయ్యాలవాడ : మండలంలోని సుద్దమల్ల గ్రామంలో సలిపెల మనోహర్‌రెడ్డి అనే రైతుకు చెందిన గడ్డివామి శుక్రవారం అగ్నికి ఆహుతైంది. గమనించిన స్థానికులు ఆళ్లగడ్డ ఫైర్ సిబ్బందికి సమాచారం చేరవేయడంతో వారు గ్రామానికి చేరుకుని మంటలను అదుపు చేయడంతో పక్కనున్న వాములకు ప్రమాదం తప్పింది. గుర్తు తెలియని వ్యక్తులు నిప్పంటించారని బాధిత రైతు వాపోయాడు. సుమారు రూ. 60 వేల పశుగ్రాసం కాలి బూడిదైందని విలపించాడు. విషయం తెలుసుకున్న వైఎస్సార్‌సీపీ ఆళ్లగడ్డ నాయకుడు భూమా కిశోర్‌రెడ్డి గ్రామానికి చేరుకుని తన వంతు సాయంగా బాధిత రైతుకు రూ.10 వేలు అందజేశారు.

మార్కెట్ల నిర్వహణకు వేలం

నంద్యాల(సిటీ): పట్టణంలోని మార్కెట్ గేట్లు, సైకిల్ పార్కింగ్, పశువుల సంత, మాంసం/ చేపల మార్కెట్‌లను సంవత్సరం పాటు నిర్వహించుకునేందుకు స్థానిక మున్సిపల్ కార్యాలయంలో శుక్రవారం బహిరంగ వేలాలు నిర్వహించారు. మున్సిపల్ అసిస్టెంట్ కమిషనర్ డాక్టర్ అంకిరెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన వేలాలకు గుడ్‌విల్, సాల్వెన్సీ, డిపాజిట్లు చెల్లించిన వ్యాపారులను అనుమతించారు. ఆయన మాట్లాడుతూ నంద్యాలలో 2024–25 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి పశువుల సంత రూ.83వేలకు, మాంసం/చేపల విక్రయాల మార్కెట్లను రూ.42,500కు వేలం పలికిందన్నారు. గతేడాది పశువుల సంత రూ.81వేలకు, మాంసం/చేపల మార్కెట్‌లకు విక్రయానికి గేట్ నిర్వహణ లేదని చెప్పారు. సరైన పోటీ లేకపోవడంతో సైకిల్ స్టాండ్, మార్కెట్ గేట్ల వేలం వాయిదా వేశామని తెలిపారు.

మెగాపవర్ ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు

రుద్రవరం: మండలంలోని ఆలమూరు విద్యుత్ సబ్‌స్టేషన్‌లో అదనంగా 8ఎంఏ పవర్ ట్రాన్స్‌ఫార్మర్‌ను ఏర్పాటు చేశారు. రూ.1.30 కోట్లతో అమర్చిన పవర్ ట్రాన్స్‌ఫార్మర్‌ను శుక్రవారం డివిజనల్ ఎలక్ట్రికల్ ఇంజినీర్ రమణారెడ్డి, ఆళ్లగడ్డ ఏడీ రవికాంత్ చౌదరి, రుద్రవరం ఏఈ రాఘవేంద్రారెడ్డి పూజలు చేసి ప్రారంభించారు. వారు మాట్లాడుతూ ఆలమూరు సబ్ స్టేషన్ పరిధిలోని రైతులకు ఎంతగానో ఉపయోగ పడుతుందని, లో ఓల్టేజీ సమస్య ఉండదని చెప్పారు.